




డోన్‌లో ఎడ్లబండ్లతో భారీ ర్యాలీ

రైతుల ద్రోహి మంత్రి బుగ్గన

● ధర్మవరం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో రైతుల కరువు కేక ● ఎడ్లబండ్లతో భారీ ర్యాలీ



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

డోన్, జనవరి 31: డోన్ నియోజకవర్గంలో కరువుతో అల్లాడుతున్న రైతులను ఆదుకోవాల్సిన మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పట్టించుకోకుండా రైతుల ద్రోహిగా మిగిలిపోయారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, డోన్ టీడీపీ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం డోన్ పట్టణంలో టీడీపీ ఇన్‌చార్జి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో రైతుల కరువు కేక నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ఎడ్లబండ్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. మంత్రి బుగ్గన ప్రాతినిధ్యం వహిస్తున్న ఇలాఖాలో రైతులు భారీగా వేలాదిగా తరలివచ్చి నిరసన తెలిపారు. మంత్రి బుగ్గన డౌన్‌డౌన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చాక రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయన్నారు. టీడీపీ హయాంలో కరువు పరిస్థితులతో పంట నష్టపోతే రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఆదుకున్నామని గుర్తు చేశారు. ఆర్థిక మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో డోన్, ప్యాపిలి మండలాలను కరువు మండలాలుగా ప్రకటించకపోవడం రైతులను అన్యాయం చేయడం కాదా అని ప్రశ్నించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. 14 మంది వైసీపీ ఎమ్మెల్యేలు ఉండి సొంత ఆదాయాలు చూసుకోవడం తప్ప, రైతుల గోడు పట్టించుకోకపోవడం చాలా దారుణమన్నారు.

ఓటమి భయంతోనే హడావుడిగా ప్రారంభోత్సవాలు

-టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుబ్బారెడ్డి

రాబోయే ఎన్నికల్లో డోన్ నియోకవర్గంలో ఓడిపోతానన్న భయంతోనే ముందుగా అసంపూర్తిగా భవనాలను మంత్రి బుగ్గన ప్రారంభోత్సవాలు చేస్తున్నారని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి ఎద్దేవా చేశారు. స్థానిక పాతబస్టాండులో సుబ్బారెడ్డి మాట్లాడుతూ డోన్, ప్యాపిలి మండలాల్లో దాదాపు 45 వేల హెక్టార్లలో రైతులు ఖరీఫ్‌లో పంటలు సాగు చేశారన్నారు. గత రెండేళ్లలో ఎన్నడూ లేని విధంగా లోటు వర్షపాతం నమోదు కావడంతో డోన్ నియోజకవర్గంలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు.. ఆర్థిక మంత్రి బుగ్గన ఉన్నప్పటికీ డోన్, ప్యాపిలి మండలాలను ఎందుకు కరువు మండలాలుగా ప్రకటించలేదని నిలదీశారు. గంజాయి, మట్కా, అక్రమ మద్యం, ల్యాండ్ మాఫియాలను పెంచి పోషించడమే మంత్రికి అలవాటైపోయిందన్నారు. ఆదాయం వచ్చే కాంట్రాక్టు పనులపైనే మంత్రి బుగ్గన దృష్టి పెట్టారని, రైతుల గురించి ఆలోచించే పరిస్థితి లేదన్నారు. రైతులకు అన్యాయం చేసిన మంత్రి బుగ్గనను ఓడించేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. డోన్ నియోజకవర్గంలో కష్టకాలంలో పార్టీ బాధ్యతలు తీసుకున్నానని, మీరంతా అండగా నిలిచి పార్టీ బలోపేతానికి సహకారాలు అందించాలని కోరారు. అనంతరం డోన్ ఆర్డీవో వెంకటరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, డోన్ నియోజకవర్గ టీడీపీ సలహాదారుల కమిటీ అధ్యక్షుడు మురళీకృష్ణగౌడు, పార్టీ పరిశీలకులు కాటమయ్య, మాజీ ఎంపీపీ ఆర్ఈ రాఘవేంద్ర, పట్టణ పార్టీ అధ్యక్షుడు సీఎం శ్రీనివాసులు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, తిమ్మయ్య యాదవ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజావైద్యశాల మల్లికార్జున, ప్యాపిలి మండల అధ్యక్షుడు గండికోట రామసుబ్బయ్య, దేవరబండ వెంకటనారాయణ, ప్రసాద్ రెడ్డి, అబిరెడ్డిపల్లె గోవిందు, ధర్మవరం గౌతమ్‌రెడ్డి, భరత్ రెడ్డి పాల్గొన్నారు.

ఆక్రమణలో టూరిజం స్థలం

● సుగాలి మెట్ట వద్ద ప్రభుత్వ స్థలాల ఆక్రమణ
● కాకినాడ మహిళకు ఇంటి స్థలం మంజూరు



సుగాలిమెట్ట వద్ద ఆక్రమణలకు గురైన రెవెన్యూ స్థలం

పాణ్యం, జనవరి 31 : మండలంలోని సుగాలి మెట్ట వద్ద రెవెన్యూ స్థలం ఆక్రమణకు గురవుతున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుగాలిమెట్టకు చెందిన కొందరు ఈ స్థలాలను ఆక్రమించి ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు. ఒక్కొక్కరు పది నుంచి ఇరవై సెంట్ల వరకు ఆక్రమించి పునాదులు వేసుకున్నారు. రెవెన్యూ అధికారులు ఈ నిర్మాణాల పట్ల చోద్యం చూస్తుండడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా ఈ ఆక్రమణలలో ప్రభుత్వ ఉద్యోగులు ఉండడం గమనార్హం. పాణ్యం పరిధిలోని 1545/ఏ1లోని 22. 785 ఎకరాల రెవెన్యూ భూమిలో ఏపి టూరిజం శాఖకు 2023 జూన్‌లో ఐదెకరాలు కేటాయించారు. ఈ స్థలం అభివృద్ధికి టూరిజం శాఖ డిసెంబరు 19న ప్రతిపాదనల నివేదిక రాష్ట్ర టూరిజం శాఖ కమిషనర్‌కు పంపడం జరిగినట్లు టూరిజం అధికారులు పేర్కొంటున్నారు. కాగా ఈ భూమి ఆక్రమణకు గురైంది. హైవే నిర్మాణంతో మిగిలిన పాత జాతీయ రహదారిని కొందరు ఆక్రమించి హోటళ్ల, బోర్లు వేసి వ్యాపారాలు చేసుకుంటున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇంటి స్థలాల మంజూరులో రెవెన్యూ శాఖ నిర్లక్ష్య ధోరణి వహిస్తుండంతో విచ్చలవిడిగా ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురౌతున్నాయి.



కొత్త పంచాయతీతో ఇబ్బందులు

పాణ్యం మజరాగా కొనసాగుతున్న సుగాలిమెట్టను 2020లో కొత్త పంచాయతీగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పంచాయతీగా ఏర్పాటైనా గ్రామానికి హద్దులు ఏర్పాటు చేయకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే అదునుగా కొందరు అక్రమార్కులు ఇష్టానుసారంగా ప్రభుత్వ స్థలంలో స్థలాలు ఆక్రమించుకున్నారు. దీంతో గ్రామానికి అవసరమైన పంచాయతీ, ఆర్బీకే, హెల్త్ కేంద్రం, తదితర కార్యాలయాలు నిర్మించడానికి ఆటంకంగా మారింది. ఒక దశలో ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు పోలీసులను ఆశ్రయించాల్సి వచ్చిందని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు.

ఆక్రమణదారులకు నోటీసులు ఇస్తాం

సుగాలిమెట్ట సమీపంలో రెవెన్యూ స్థలాన్ని ఆక్రమించిన వారికి నోటీసులు జారీ చేస్తాం. 1545/ఏ1 లోని రెవెన్యూ స్థలంలో టూరిజం శాఖకు ఐదెకరాలు రెవెన్యూ స్థలం మంజూరు చేసింది. రెవెన్యూ శాఖ అనుమతి లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు. సుగాలిమెట్టలో ఇంటి స్థలాలకు దరఖాస్తులు అందలేదు.

- శ్రీనివాసులు గౌడ్, తహసీల్దారు, పాణ్యం

ఆక్రమణలో టూరిజం స్థలం

పశ్చిమగోదావరి జిల్లా కాకినాడకు చెందిన ఒక మహిళకు సుగాలిమెట్ట వద్ద 2014 ఫిబ్రవరి 2వ తేదీన ఐదు సెంట్ల స్థలాన్ని రెవెన్యూ శాఖ కేటాయించింది. ఈ కేటాయింపు వెనక ఒక మాజీ రాష్ట్ర ఉన్నతాదికారి హస్తమున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. కేటాయించిన ఐదు సెంట్లకు బదులు 15 సెంట్లు ఆక్రమించి అధునాతన భవనాన్ని నిర్మించారు. ఈ నిర్మాణాన్ని సాకుగా చూపి కొందరు ప్రభుత్వ ఉద్యోగులు 20 సెంట్ల వరకు స్థలాలు ఆక్రమించి పునాదులు ఏర్పాటు చేసుకున్నారు. ఈ నిర్మాణానికి ఎటువంటి పంచాయతీ అనుమతి లేకపోయినా పంచాయతీ అధికారులు ఇంటికి పన్ను, నెంబరు కేటాయించారు. కాగా స్థానికులకే ఇంటి స్థలం ఇవ్వాల్సిన రెవెన్యూ శాఖ జిల్లాకు సంబంధం లేని వ్యక్తికి స్థలం కేటాయించడంపై నిరుపేదలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ స్థలంలో దాదాపు 20 సెంట్లు ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టారు. దీంతో ఈ స్థలం కేటాయింపుతో మరి కొందరు ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధగా ఆక్రమించి పునాదులు వేసుకున్నారు. రెవెన్యూ నిబంధనలను కాదని ఏకంగా బోర్లు వేసుకున్నారు. ఇంటి నిర్మాణాలకు పంచాయతీ అనుమతులు లేకపోయినా విద్యుత్ శాఖ విద్యుత్ మీటర్లు కేటాయించి కరెంట్ ఇచ్చారు. ఆక్రమణలలో ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.



రెవెన్యూ స్థలంలో నిర్మించిన అక్రమ కట్టడం

నేడు శ్రీశైలానికి నారా లోకేశ్



శ్రీశైలం/ఆత్మకూరు, జనవరి 31: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ గురువారం శ్రీశైలం క్షేత్రానికి రానున్నారు. హైదరాబాద్‌లో బేగంపేట నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో గురువారం ఉదయం 8గంటలకు బయలుదేరి 9గంటలకు సున్నిపెంటకు చేరుకుంటారు. ఉదయం 9:30 గంటలకు సాక్షిగణపతి స్వామిని దర్శించుకుని తరువాత భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం 11:30గంటలకు సున్నిపెంటకు చేరుకుని మధ్యాహ్నం 12:30 గంటలకు హైదరాబాద్‌కు చేరుకుంటారు.

డోలమైట్ తరలిస్తున్న లారీలు సీజ్

● పోలీస్‌స్టేషన్‌కు తరలింపు



అక్రమ ఖనిజాన్ని తలిస్తున్న లారీ

కర్నూలు(అర్బన్), జనవరి 31: అక్రమంగా డోలమైట్, ఖనిజాన్ని తరలిస్తున్న 2 రెండు లారీలు, 2 టిప్పర్లను సీజ్ చేశామని మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం డోన్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఒక లారీని ఉల్లిందకొండ వద్ద, బెంగళూరు వెళుతున్న మరో లారీని డోన్ వద్ద సీజ్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించామని తెలిపారు. మరో రెండు టిప్పర్లు రోడ్డు మెటల్ తరలిస్తుండగా సీజ్ చేసి పెనాల్టీ విధించామని చెప్పారు. ఈ తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

పడిపోతున్న ఉల్లి ధర

● క్వింటా గరిష్ఠ ధర రూ.1,161

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 31: ఆరుగాలం శ్రమించి కాస్తో.. కూస్తో చేతికందిన పంట ఉత్పత్తులను గిట్టుబాటు ధరకు అమ్ముకుందామని ఆశిస్తున్న రైతుల పరిస్థితి మార్కెట్‌లో వ్యాపారుల మాయాజాలంతో క్షీణిస్తోంది. కర్నూలు మార్కెట్ యార్డులో గత నెల క్వింటా వేరుశనగకాయల ధర గరిష్ఠంగా రూ.8,500కు ఉండగా.. బుధవారం కర్నూలు మార్కెట్ యార్డులో గరిష్ఠ ధర రూ.7,020, మధ్యస్థ ధర రూ.6,449, కనిష్ఠ ధర రూ.3,500కు పడిపోయింది. ఉల్లిగడ్డల పరిస్థితి కూడా రోజురోజుకూ దిగజారుతోంది. గత నెల క్వింటా ఉల్లిగడ్డలకు రూ.3వేలు పైగానే ధర ఉంటే బుధవారం గరిష్ఠంగా రూ.1,161, మధ్యస్థ ధర రూ.861లు, కనిష్ఠ ధర రూ.297 మాత్రమే రైతుల చేతికి దక్కింది. ఎండుమిరప కాయలు కూడా ధర ఆశాజనకంగా లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత నెలలో క్వింటా ఎండుమిరప కాయలు గరిష్ఠ ధర రూ.25వేలకు దక్కగా, బుధవారం కేవలం గరిష్ఠ ధర రూ.19,589, మధ్యస్థ ధర రూ.17,200, కనిష్ఠ ధర కేవలం రూ.3,599 మాత్రమే దక్కడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మహా శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్, ఈవో

శ్రీశైలం, జనవరి 31: శ్రీశైలం మహాక్షేత్రంలో మార్చి 1 నుంచి 11 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. బుధవారం ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది అంతా మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల కల్పనలో నిమగ్నమై ఉండాలన్నారు. కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు మాట్లాడుతూ వైదిక సిబ్బంది, ఆలయ విభాగ అధిపతులు పరస్పర సమన్వయంతో ఉత్సవ కార్యక్రమాలు, స్వామి, అమ్మవార్ల కైంకర్యాలు సంప్రదాయబద్ధంగా జరిపించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి విభాగం కూడా రూపొందించిన ఆక్షన్ ప్లాన్‌ను అనుసరించి బ్రహ్మోత్సవాలకు ముందుగానే పనులు పూర్తి చేయాలన్నారు. క్షేత్రానికి పాదయాత్రగా తరలివచ్చే భక్తులకు అటవీ సహకారంతో ఆయా ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా బందోబస్తు, వసతి, వైద్య సదుపాయం, క్షేత్రపరిధిలో ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్య పనులు, సౌచాలయాలు, క్యూలైన్ల నిర్వహణ, విద్యుద్దీపాలు, సూచిక బోర్డులు, పాతాళగంగ వద్ద ఏర్పాట్లు తదితర వాటిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆయా విభాగాధిపతులను ఆదేశించారు. సమావేశంలో ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, సహాయ కమిషనర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శిల్పాను వదిలే ప్రసక్తే లేదు

● ఆధారాలతో అక్రమాలను నిరూపిస్తా ● శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు, జనవరి 31: టీడీపీ అధికారంలోకి వస్తే ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని వదిలే ప్రసక్తే లేదని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. బుధవారం ఆత్మకూరు మండలంలోని అమలాపురం గ్రామంలో జయహో బీసీ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే శిల్పా ఎక్కడి నుంచి వలసొచ్చి డబ్బు మదంతో రాజకీయాలు చేయాలని చూస్తే సహించే ప్రసక్తే లేదని అన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎమ్మెల్యే శిల్పా చేసిన అక్రమాలు, అరాచకాలపై ఆధారాలతో నిరూపించి అరెస్టు చేయిస్తానని స్పష్టం చేశారు. ప్రత్యేకించి ఆత్మకూరు ప్రాంతంలో వర్ధన్ బ్యాంకు ప్రారంభించిన మూడు నెలల వ్యవధిలోనే రూ.30 కోట్లు కొట్టేసిన వ్యక్తి శిల్పా అని విమర్శించారు. ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ పదవిని రూ.2 కోట్లకు, వెలుగోడు ఎంపీపీ పదవిని రూ.1.5 కోట్లకు, బండిఆత్మకూరు ఎంపీపీ పదవిని రూ.75 లక్షలకు అమ్ముకున్న ఘనుడు శిల్పా ధ్వజమెత్తారు. ఆత్మకూరు ఎంపీపీగా తమకు అవకాశం ఇచ్చి చివరకు రూ.60 లక్షలు ఇవ్వనందుకు మొండిచేయి చూపారని ఆ పార్టీకి చెందిన నాయకుడు కుంట శివారెడ్డి బహిరంగంగా విమర్శించారని వివరించారు. అదేవిధంగా ఆత్మకూరు ఎంపీపీ పదవికి రూ.35లక్షలు వసూలు చేసి ఎస్సీ మహిళకు కట్టబెట్టాడని, ఆ డబ్బును చెల్లించేందుకు ఆమె భర్త తమకున్న రెండెకరాల పొలాన్ని పోగొట్టుకొని చివరికి ఏం చేయాలో తోచక ప్రాణాలే కోల్పోవాల్సిన దుస్థితికి వచ్చారని తెలిపారు. ప్రజలు కూడా ఎన్నికల్లో ఇచ్చే వెయ్యి, రెండు వేలు ఆశించకుండా అభివృద్ధి చేసే నాయకులను ఎంచుకోవాలని సూచించారు. ఆనాడు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూ.120 కోట్లను ఖర్చు చేసి సిద్దాపురం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తే నేడునాశనం చేశారని ఆవేదన చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే సిద్దాపురం ఆయకట్టును పూర్తి స్థాయిలో స్థిరీకరించడమే కాకుండా శ్రీపతిరావుపేట, ఇందిరేశ్వరం, అమలాపురం, వెంకటాపురం, కృష్ణాపురం గ్రామాల పంట పొలాలకు సాగనీరందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో రాష్ట్ర బీసీసెల్ కోఆర్డినేటర్ తిరుపాలుబాబు, నాయకులు శివప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ మహానంది గంగాదేవీ, వేణుగోపాల్, రవీంద్రబాబు, అబ్దుల్లాపురం బాష, గిరిరాజు, డీ.శ్రీనివాసులు, ఇరగదిండ్ల మురళీ, రామనర్సయ్య, గోకారి, నాగార్జునయాదవ్, శివప్రసాద్, రాజారెడ్డి, జనసేన నాయకులు శ్రీరాములు ఉన్నారు.



మాట్లాడుతున్న శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



జయహో బీసీ సదస్సుకు హాజరైన జనం

నంద్యాలలో డీజీపీ



రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఉమ్మడి జిల్లా పోలీస్ అధికారులు

నంద్యాల క్రైం, జనవరి 31: రాష్ట్ర డీజీపీ కె.రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం నంద్యాలకు వచ్చారు. స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌వద్ద కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్, కర్నూలు ఎస్పీ కృష్ణకాంత్, నంద్యాల ఎస్పీ రఘువీర్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా డీజీపీకి స్వాగతం పలికారు. పోలీస్ సిబ్బంది ఆయనకు గౌరవ వందనం చేశారు. కాగా డీజీపీ వ్యక్తిగత పనులపై నంద్యాలకు వచ్చినట్లు సమాచారం.

జిల్లాలో అధికారుల బదిలీ

● డీఆర్వోగా పద్మజ ● నంద్యాల, డోన్ ఆర్డీవోలుగా మల్లికార్జునరెడ్డి, మహేశ్వరరెడ్డి

నంద్యాల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తున్న వేళ జిల్లాలో అధికారుల బదిలీలు మొదలయ్యాయి. డీఆర్వో, నంద్యాల, డోన్ ఆర్డీవోలుగా కొత్త వారిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం నంద్యాల డీఆర్వోగా పనిచేస్తున్న బి.పుల్లయ్య చిత్తూరు బదిలీ కాగా, ఆయన స్థానంలో డిప్యూటీ కలెక్టర్ పద్మజ వచ్చారు. నంద్యాల ఆర్డీవోగా పనిచేస్తున్న శ్రీనివాసులు జమ్మలమడుగుకు బదిలీ కాగా ఆయన స్థానంలో రాజంపేట ఎస్ఎస్‌పీ యూనిట్-4 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.మల్లికార్జునరెడ్డిని నియమించారు. డోన్ ఆర్డీవోగా బి.మహేశ్వరరెడ్డి పదోన్నతిపై విధుల్లో చేరనున్నారు. ప్రస్తుతం డోన్ ఆర్డీవోగా విధులు నిర్వహిస్తున్న కె.వెంకటరెడ్డి బదిలీపై నగరికి బదిలీ అయ్యారు. కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్‌గా బి.ఉమామహేశ్వరి పదోన్నతిపై నంద్యాలకు రానున్నారు.



సోనాకు కష్టకాలం

- కేసీ కాలువ కింద తగ్గిన వరి సాగు
- వర్షాభావంతో తప్పని ఆరుతడి పంటలు
- ప్యాకెట్ బియ్యం రూ.3500

పగిడ్యాల, జనవరి 31: బియ్యమంటే కర్నూలు సోనా. విదేశాల్లో కూడా పేరున్న బియ్యం. అట్లాంటి సోనా వరికి కష్టకాలం వచ్చింది. అందరికీ తిండిపెట్టే రైతులు వరి సాగు చేయలేని పరిస్థితి ఏర్పడింది. చివరికి రైతులకే బియ్యం కరువయ్యాయి. ప్రతి ఏటా కేసీ కాలువ కింద పెద్ద ఎత్తున కర్నూలు సోన రకం వరి పంటను రైతులు సాగు చేసేవారు. పంట దిగుబడిలో ఇంటి అవసరాలకు ఉంచుకొని మిగిలిన ధాన్యాన్ని విక్రయించుకునే వారు. అయితే ఆ ఏడాది వర్షాభావం వల్ల జలాశయాలకు వరద నీరు సక్రమంగా అందలేదు. దీంతో వరి సాగు బాగా తగ్గిపోయింది. కేసీ కాలువ అధికారులు నీటి విడుదలపై రైతులకు స్పష్టమైన హామీ ఇవ్వలేదు. కాలువ కింద ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. దీంతో ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న, మినుము, జొన్న తదితర పంటలు సాగు చేసుకోవాల్సి వచ్చింది. మండల పరిధిలోని పగిడ్యాల, పాలమర్రి, సంకిరేణిపల్లె, ముచ్చుమర్రి, నెహ్రూనగర్, ప్రాతకోట, ఘణపురం గ్రామాల్లో కేసీ కాలువ కింద మొక్కజొన్న 325 హెక్టార్లు, మినుము 2216 హెక్టార్లలో, జొన్న, వేరుశనగ పంటలు సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. దీనికితోడు పంటలు తెగుళ్ల బారిన పడటంతో దిగుబడి తగ్గిపోయిందని రైతులు తెలిపారు.



కేసీ కింద సాగైన పంట

మొదటిసారి బియ్యం కొంటున్నాం



కేసీ కాలువకు నీటి విడుదల విషయంలో అధికారులు స్పష్టమైన ప్రకటన చేయలేదు. దీంతో వరి సాగు దెబ్బతినిపోయింది. చివరికి ఇంట్లో అవసరాలకు కూడా బియ్యం కొనాల్సి వస్తోంది. ఏటా కేసీ కాలువ కింద 15 ఎకరాలలో వరి పంటను సాగు చేసేవాడ్ని. ఈ ఏడాది ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని అధికారులు అన్నారు. దీంతో 15 ఎకరాలలో మినుము, మొక్కజొన్న, వేరుశనగ, జొన్న పంటలు సాగు చేశాం. కుటుంబ అవసరాలకు 30 ప్యాకెట్ల బియ్యం కొన్నాను.

- ధర్మక్షేత్ర, రైతు, పగిడ్యాల

50 కేజీల బియ్యం ప్యాకెట్ రూ.3500




వర్షాభావ పరిస్థితుల కారణంగా కేసీ కాలువ కింద రైతులు మొక్కజొన్న, మినుము పంటలను సాగు చేయడంతో వరి పంటల సాగు తగ్గిపోయింది. దీంతో మార్కెట్‌లో సోనా బియ్యం ధరలు పెరిగాయి. 50 కేజీల ప్యాకెట్ రూ. 3200-3500 పలుకుతోంది. అక్కడక్కడ వరి సాగు చేసిన రైతులు నూర్పిడి చేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించి బియ్యం విక్రయిస్తున్నారు. గతంలో కేసీ కాలువ కింద రైతుల వరి పంటలను సాగు చేయడం వలన ప్రతి ఇంట్లో బియ్యం ఉండేవి. ఈ ఏడాది ఆరుతడి పంటలు సాగు చేయడం వలన రైతులకు తినడానికి కూడా బియ్యం లేక అంగట్లో కొనుక్కోవాల్సి వస్తోంది. . గతంలో ఎప్పుడూ ఇట్లా బియ్యం కొని తినాల్సిన పరిస్థితి రాలేదని రైతులు అంటున్నారు. కేసీ కాలువకు నవంబరు చివరి వరకు నీరు విడుదల చేస్తామని చెప్పిన కేసీ కాలువ అధికారులు, ప్రజాప్రతినిధులు తమకు ఇబ్బందులకు గురి చేశారని రైతులు మండిపడుతున్నారు.

తహసీల్దార్లకు స్థానచలనం

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 31: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కర్నూలు జిల్లా వ్యాప్తంగా పలువురు తహసీల్దార్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ స్పెషల్ సీఎస్ చీఫ్ కమిషనర్ జి.సాయిప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లా నుంచి 13 మంది, చిత్తూరు నుంచి 9 మంది, కడప నుంచి ముగ్గురు కర్నూలుకు బదిలీ అయ్యారు. కర్నూలు నుంచి కడపకు 10 మంది, అనంతపురానికి 11 మంది, చిత్తూరు జిల్లాకు ఐదుగురు బదిలీ అయ్యారు. బదిలీ అయిన తహసీల్దార్ల వివరాలు ఇలా...

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
శ్రీధర్ మూర్తి	అనంతపురం	కర్నూలు
షర్మిళ	అనంతపురం	కర్నూలు
శేషారెడ్డి	అనంతపురం	కర్నూలు
మునివేలు	అనంతపురం	కర్నూలు
మోహన్ కుమార్	అనంతపురం	కర్నూలు
ఈరమ్మ	అనంతపురం	కర్నూలు
ఓబులేసు	అనంతపురం	కర్నూలు
రజాక్‌వలి	అనంతపురం	కర్నూలు
ఈశ్వరయ్యశెట్టి	అనంతపురం	కర్నూలు
అనుపమ	అనంతపురం	కర్నూలు
నటరాజు	అనంతపురం	కర్నూలు
అనంతాచారి	అనంతపురం	కర్నూలు
హసీనా సుల్తానా	అనంతపురం	కర్నూలు
శేఖర్	చిత్తూరు	కర్నూలు
వసుదేవన్	చిత్తూరు	కర్నూలు
బేలయ్య	చిత్తూరు	కర్నూలు
మాధవరాజ్	చిత్తూరు	కర్నూలు
చంద్రశేఖర్	చిత్తూరు	కర్నూలు
పార్వతి	చిత్తూరు	కర్నూలు
గుర్రప్ప	చిత్తూరు	కర్నూలు
ఉదయ్ సంతోష్	చిత్తూరు	కర్నూలు
ఝాన్సీ లక్ష్మి	చిత్తూరు	కర్నూలు
శేషయ్య	కడప	కర్నూలు
నిర్మలాదేవి	కడప	కర్నూలు
అనురాధ	కడప	కర్నూలు
శివరాముడు	కర్నూలు	కడప
జయన్న	కర్నూలు	కడప
రాజేశ్వరి	కర్నూలు	కడప
విజయశ్రీ	కర్నూలు	కడప
వెంకటేశ్ నాయక్	కర్నూలు	కడప
గోవింద్ సింగ్	కర్నూలు	కడప
వెంకటరమణ	కర్నూలు	కడప
వెంకటలక్ష్మీ	కర్నూలు	కడప
రమేష్‌బాబు	కర్నూలు	కడప
నిత్యానంద	కర్నూలు	కడప
శేషఫణి	కర్నూలు	అనంతపురం
కుమారస్వామి	కర్నూలు	అనంతపురం
మల్లికార్జునస్వామి	కర్నూలు	అనంతపురం
నజీమా బాను	కర్నూలు	అనంతపురం
వేణుగోపాల్	కర్నూలు	అనంతపురం
సతీష్	కర్నూలు	అనంతపురం
ఆంజనేయులు	కర్నూలు	అనంతపురం
శ్రీనాథ్	కర్నూలు	అనంతపురం
వసుంధర	కర్నూలు	అనంతపురం
శివప్రసాద్ రెడ్డి	కర్నూలు	అనంతపురం
శివశంకర్ నాయక్	కర్నూలు	అనంతపురం
వేణుగోపాల్‌రావు	కర్నూలు	చిత్తూరు
రవి	కర్నూలు	చిత్తూరు
చంద్రశేకర్	కర్నూలు	చిత్తూరు
రామాంజనేయులు	కర్నూలు	చిత్తూరు
హంశేన్‌సాహేబ్	కర్నూలు	చిత్తూరు

ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌కు వినియోగదారుల కమిషన్ వడ్డింపు



కర్నూలు(లీగల్), జనవరి 31: మృతి చెందిన ఇద్దరు పాలసీదారుల నామినీలకు బీమా మొత్తం చెల్లించకుండా సేవా లోపం చేసిన ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలకు జిల్లా వినియోగదారుల కమిషన్ తగిన రీతిలో వడ్డించింది. నందికొట్కూరు చెందిన వి.మధుకుమార్ 2021లో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి రూ.50లక్షల పాలసీని తీసుకున్నాడు. పాలసీ ఇచ్చే ముందు కంపెనీ అధికారులు ఫిర్యాదిని అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించారు. ఆ తర్వాత 2022 ఏప్రిల్‌లో అతను గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో పాలసీలో నామినీ అయిన మృతుని భార్య పి.శైలజ పాలసీ మొత్తం కోసం ఇన్సూరెన్స్ కంపెనీకి దరఖాస్తు చేసుకుంది. అయితే.. మృతుడు గతంలో తీసుకున్న గుండె చికిత్స వివరాలను కంపెనీకి తెలియపరచకుండా తీసుకున్నాడని ఆమె దరఖాస్తును తిరస్కరించింది. దీంతో మృతుని భార్య జిల్లా వినియోగదారుల కమిషన్‌లో కేసు దాఖలు చేసింది. మరొక కేసులో స్థానిక రోజావీధికి చెందిన బి.కాశిరెడ్డి 2020లో అదే ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి రూ.50 లక్షల పాలసీని చేయించుకుని 2022లో గుండెపోటుతో మృతి చెందాడు. మృతుని భార్య సుబ్బలక్ష్మమ్మ పాలసీ మొత్తం కోసం చేసుకున్న క్లెయిమ్‌ను కూడా తిరస్కరించింది. దీంతో ఈమె కూడా కేసు దాఖలు చేసింది. రెండు కేసులను విచారించిన వినియోగదారుల కమిషన్ ఫిర్యాదిదారుల క్లెయిమ్‌ను తిరస్కరించడం సేవాలోపం అవుతుందని విచారించింది. దీంతో ఫిర్యాదిదారులకు క్లెయిమ్‌ల మొత్తాలతో పాటు కోర్టు ఖర్చుల కింద అదనంగా మరో రూ.60ల చొప్పున చెల్లించాలని ఆదేశిస్తూ కమిషన్ అధ్యక్షుడు కరణం కిషోర్ కుమార్, సభ్యులు ఎన్.నారాయణ రెడ్డి, నజీమా కౌసర్‌లు ఆదేశాలు జారీ చేశారు.

మంత్రాలయం అభివృద్ధికి పీఠాధిపతి కృషి

- మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు



మంత్రాలయం, జనవరి 30: మంత్రాలయం పట్టణంతో పాటు మఠం అభివృద్ధికి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఎనలేని కృషి చేస్తున్నారని మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రాలయంతో పాటు శ్రీమఠాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో ఉన్న ప్రభుత్వ భవనంతో పాటు స్థలాన్ని బదలాయింపుతో పాటు రిజిస్ట్రేషన్ చేసుకున్నామని వెల్లడించారు. మంత్రాలయంలోని ప్రభుత్వ కార్యాలయాలైన పోలీస్‌స్టేషన్, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయం, కళాశాల, సీఆర్వో ఆఫీసు తదితర కార్యాలయాలకు సంబంధించిన భూములు శ్రీమఠానికి చెందినవి కావడంతో ఖాళీ చేయాలని రెండుసార్లు నోటీసులు ఇచ్చామన్నారు. ఆయా కార్యాలయాల అధికారులు భవనాలు నిర్మించదలిస్తే పీఠాధిపతి ఆదేశాల మేరకు స్థలాలను కేటాయిస్తామన్నారు. వేసవి సీజన్‌లో మంత్రాలయం పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును నిర్మిస్తామన్నారు.

కబ్జాపై ప్రశ్నించినందుకు దాడి

- రాళ్లు, కర్రలతో కొట్టిన వైసీపీ నాయకుడు
- గణేష్‌కు తీవ్ర గాయాలు

హొళగుంద, జనవరి 31: పొలం కబ్జా చేసిందే కాకుండా బాధితుడిని ఓ వైసీపీ నాయకుడి కుటుంబం రాళ్లు, కర్రలతో చితకబాదింది. బాధితుడి వివరాల మేరకు.. మండలంలోని ముద్దటమాగి గ్రామానికి చెందిన భీమన్నకు సర్వే నెం.109ఎఫ్‌లో నాలుగు ఎకరాల భూమి ఉంది. అందులో ఆయన కుమారులైన గణేష్‌కు మూడు ఎకరాలు, శీనుకు 0.50 సెంట్లు, పొంపకు 0.50 సెంట్లు భూమి రాసి ఇచ్చాడు. ఈ భూమిని 30 ఏళ్లుగా వారే సాగు చేసుకుంటున్నారు. వీరి పొలానికి ఆనుకొని అదే గ్రామానికి చెందిన కృష్ణారెడ్డికి భూమి ఉంది. అయితే అతను గణేష్ పొలంలో 50 సెంట్లకు పైగా కబ్జా చేసి అందులో కంది పంటను వేసుకున్నాడు. ఈ విషయంపై పలుమార్లు తహసీల్దారు, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎవరు పట్టించుకోలేదు. దీంతో తన పొలంలో అక్రమంగా వేసిన కంది పంటను కొంతమేరకు తొలగించి తన స్నేహితులతో ఇంటికి ఇంటికి వెళుతుండగా మార్గమధ్యంలో వైసీపీ నాయకుడు గాదిలింగ అతడి అన్న వెంకటేష్‌తో పాటు మరో 8మంది రాళ్ల కర్రలతో దాడి చేసి గాయపరిచారు. ఈ దాడిలో గణేష్‌కు కన్ను, వీపు, కడుపుపై గాయాలయ్యాయి. అధికారం ఉందని ఇలా దౌర్జన్యం చేయడం ఏమిటని, దాడికి పాల్పడిన ఆ వైసీపీ నాయకుడితోపాటు అతని అనుచరులపై కేసు నమోదు చేయాలని బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ విషయంపై ఎస్సై పెద్దయ్య నాయుడుని వివరణ కోరగా ఇరువురు పోలీసులకు ఫిర్యాదు చేశారని, విచారణ చేపట్టి తప్పు చేసిన వారిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు.



హొళగుందలో మాట్లాడుతున్న బాధితుడు



వీపుపై గాయాలను చూపుతున్న బాధితుడు

వాహన చట్టాలపై అవగాహన అవసరం

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 31: వాహనాదారులకు చట్టాలపై అవగాహన అవసరమని కలెక్టర్ జి.సృజన అన్నారు. బుధవారం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా కలెక్టరేట్ నుంచి సీ.క్యాంపు సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జనవరి 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 19 వరకు జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను నిర్వహిస్తుందన్నారు. యువత 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే డ్రైవింగ్ లైసెన్స్ పొందాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీఓ రమేష్, ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

పశుసంవర్థక శాఖలో

బదిలీలకు కసరత్తు

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 31: ఎన్నికల కోడ్ రానుండటంతో పశుసంవర్థక శాఖలో బదిలీలకు అధికారులు కసరత్తు పూర్తి చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మూడు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న వారికి బదిలీ ప్రక్రియను నిర్వహించేందుకు పశుసంవర్థక శాఖ ఉన్నతాధికారులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా పశుసంవర్థక శాఖలో పని చేస్తున్న ఏహెచ్‌ఏ సిబ్బంది బదిలీలను బుధవారం చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో 130 మంది ఏహెచ్‌ఏలు పని చేస్తుండగా.. అందులో 88 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నట్లు జేడీ రామచంద్రయ్య తెలిపారు.

నేడు ఓరియంటేషన్ ప్రోగ్రాం

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 31: జిల్లాలోని అన్నీ యాజమాన్యాల జూనియర్ కాలేజీల్లో పని చేస్తున్న సైన్స్ లెక్చరర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు గురువారం కర్నూలు ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో ఒక రోజు ఓరియంటేషన్ ప్రోగ్రాంను ఏర్పాటు చేసినట్లు ఆర్‌ఐవో ఎస్‌వీఎస్ గురువయ్య శెట్టి బుధవారం తెలిపారు. విధిగా సైన్స్ లెక్చరర్లు, కంప్యూటర్ ఆపరేటర్లను సమావేశానికి పంపాలని కళాశాలల ప్రిన్సిపాల్స్ యజమాన్యాలకు ఆయన చెప్పారు.

మహిళ ఆత్మహత్య

హొళగుంద, జనవరి 31 : మండలంలోని నెరణికి గ్రామానికి చెందిన భారతి (27) ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన బుధవారం జరిగింది. భారతి మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకున్నది. చుట్టుపక్కల వారు గమనించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతిరాలికి భర్త రాజశేఖర్, ఇద్దరు అబ్బాయిలు, ఒక కూతురు ఉన్నారు. భారతి ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్), జనవరి 31: ఐసీడీఎస్ కర్నూలు జిల్లా పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, మినీ టీచర్ల, ఆయా పోస్టులకు అర్హులైన స్త్రీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సాధికారిత అధికారి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి. వెంకటలక్ష్మమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తలు 11, మినీ టీచర్ 1, ఆయా పోస్టులు 84 ఖాళీగా ఉన్నాయన్నారు. అంగన్‌వాడీ టీచర్ల పోస్టుకు 10వ తరగతి పాసై ఉండాలని, ఆయా పోస్టుకు 7వ తరగతి పాసై ఉండాలన్నారు. 1.7.2023 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. పెళ్లయి అదే గ్రామంలో నివసిస్తూ ఉండాలని అన్నారు. దరఖాస్తులను సీడీపీవో కార్యాలయంలో ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలన్నారు.

ఏపీఎస్పీ రెండో బెటాలియన్ కమాండెంట్ బదిలీ

కర్నూలు, జనవరి 31: ఏపీఎస్పీ రెండో బెటాలియన్ కమాండెంట్ రవిశంకర్‌ను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఏపీఎస్పీ 11వ బెటాలియన్ (కడప)కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో 11వ బెటాలియన్ కమాండెంట్‌గా ఉన్న శ్రీనివాసరావును నియమించింది. అలాగే 11వ బెటాలియన్ అడిషినల్ కమాండెంట్‌గా ఉన్న ప్రభుకుమార్‌ను ఏపీఎస్పీ రెండో బెటాలియన్ అడిషినల్ కమాండెంట్‌గా నియమించింది.

- సెబ్ అడిషనల్ ఎస్పీకి పోస్టింగ్ మార్పు: కర్నూలు సెబ్ అడిషినల్ ఎస్పీ కృష్ణకాంత్ పాటిల్ పోస్టింగ్‌ను మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన గతంలో కాకినాడ బెటాలియన్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతం విజయవాడ లా అండ్ ఆర్డర్ డీసీబీగా బదిలీ చేసింది.

ఆర్‌ఐలకు స్థానచలనం

కర్నూలు, జనవరి 31: రిజర్వుడు ఇన్‌స్పెక్టర్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలులో ఉన్న పోతల రాజును తిరుపతికి, రవికుమార్‌ను సత్యసాయి జిల్లాకు, రమణ, శివారెడ్డిలను తిరుపతికి, సుదాకర్‌ను చిత్తూరుకు బదిలీ చేసింది. అలాగే సత్యసాయి జిల్లాలో ఉన్న నారాయణను కర్నూలుకు, రాజశేఖర్ రెడ్డిని తిరుపతికి, కడపలో ఉన్న సోమ శేఖర్ నాయక్‌ను కర్నూలుకు అన్నమయ్య జిల్లాలో ఉన్న జావీదును, చిత్తూరులో ఉన్న మధును కర్నూలుకు బదిలీ చేసింది. తిరుపతిలో ఉన్న నాగభూషణను నంద్యాలకు బదిలీ చేసింది.

శాశ్వత లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

- జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్.శ్రీనివాసరావు



అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్.శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్), జనవరి 31: ప్రజా వినియోగ సేవా రంగాల ద్వారా నష్టపోయిన బాధితులకు శాశ్వత లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం అందుతుందని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక లోక్ అదాలత్ కార్యాలయంలో బుధవారం జరిగిన ఒక అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రవాణా, పోస్టల్, విద్యుత్, మున్సిపాలిటీ, బీమా, బ్యాంకింగ్ తదితర రంగాల ద్వారా నష్టపోయిన బాధితులు శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించాలని ఆయన కోరారు. బాధితులకు ఎటువంటి కోర్టు ఫీజులు లేకుండా సత్వర న్యాయాన్ని శాశ్వత లోక్ అదాలత్ అందజేస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు, శాశ్వత లోక్‌అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకటహరినాథ్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్టు

కర్నూలు, జనవరి 31: నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ శంకరయ్య, ఎస్ఐ మోహన్ కిషోర్ రెడ్డిల ఆధ్వర్యంలో నిందితులు పిల్లి బద్రి అలియాస్ మహేష్ (పొద్దుటూరు), కావలి నరసింహులు (రంగారెడ్డి జిల్లా)లను అరెస్టు చేశారు. నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి ఐదు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు కర్నూలు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు బైకులను, తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక బైకును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

యువతి ఆత్మహత్య

హాలహర్వి, జనవరి 31 : మండలంలోని విరుపాపురం గ్రామంలో ఓ యువతి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పెళ్లి సంబంధాలన్నీ వెనక్కి పోతున్నాయనే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

ఆత్మకూరు అర్బన్ సీఐగా లక్ష్మీనారాయణ బాధ్యతల స్వీకరణ


సీఐ లక్ష్మీనారాయణ

ఆత్మకూరు, జనవరి 31: ఆత్మకూరు అర్బన్ సీఐగా లక్ష్మీనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆత్మకూరు సర్కిల్‌లోని ఆత్మకూరు, వెలుగోడు, కొత్తపల్లి, పాములపాడు పోలీసుస్టేషన్లకు సంబంధించి ఇంతకాలం ఒక్కరే సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వ్యవహరించేవారు. అయితే ఆత్మకూరు పోలీసుస్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేయడంతో ఇకనుంచి ఆత్మకూరు పోలీసు స్టేషన్‌కు స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా అర్బన్ సీఐ వ్యవహరించనున్నారు. అలాగే కొత్తపల్లి, పాములపాడు, వెలుగోడు పోలీసుస్టేషన్ల పరిధికి సంబంధించి ఆత్మకూరు రూరల్ సీఐగా ఇప్పటివరకు ఆత్మకూరు సీఐగా ఉన్న నాగభూషణ్ కొనసాగనున్నారు. ఇదిలావుంటే కడప జిల్లా రైల్వేకోడూరుకు చెందిన సీఐ లక్ష్మీనారాయణ 2009 బ్యాచ్‌లో ఎస్సైగా ఎంపికయ్యారు. చిత్తూరు జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్లలో పనిచేస్తూ 2021లో పదోన్నతిపై సీసీఎస్ సీఐగా ఎంపికయ్యారు. ఆతర్వాత పుత్తూరు సీఐగా విధులు నిర్వహిస్తూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆత్మకూరు అర్బన్ సీఐగా ఇక్కడికి వచ్చారు. ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆత్మకూరు ఎస్‌ఐలు కృష్ణమూర్తి, వెంకట నారాయణరెడ్డి ఆయన్ని కలిసి పరిచయం చేసుకున్నారు. సీఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల, పోలీసు స్టేషన్ సిబ్బంది సహకారంతో సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా పూర్తిచేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

వెలుగోడు ఎస్‌ఐగా భూపాలుడు


ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన భూపాలుడు

వెలుగోడు, జనవరి 31: వెలుగోడు మండల ఎస్‌ఐ గా బి. భూపాలుడు బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన కర్నూలు జిల్లా దేవనకొండ మండలంగా ఎస్‌ఐ గా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెలుగోడుకు వచ్చారు. వెలుగోడు ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న వెంకటప్రసాద్ అన్నమయ్య జిల్లా గాలివీడుకు బదిలీపై వెళ్లారు. ఎస్‌ఐగా మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని చెప్పారు.

'పేదల కోసం వైద్య శిబిరాలు'

ఆత్మకూరు, జనవరి 31: పేదల నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్న ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట పట్టణంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా తెలిపారు. ఈమేరకు బుధవారం ఎస్పీజీపాలెం సచివాలయం-2 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష -2 కార్యక్రమాన్ని వారు సందర్శించారు. అక్కడ ప్రజలకు అందిస్తున్న వైద్యసేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా వైద్యఆరోగ్య శాఖ, ఐసీడీఎస్ వారు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

'లెనిన్ ఆశయ సాధన కోసం పని చేయాలి'

నందికొట్కూరు జనవరి 31: సిద్ధాంతవేత్త లెనిన్ ఆశయాల కోసం పని చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం నందికొట్కూరు వైష్ణవి కళాశాలలో సీపీఎం ఆధ్వర్యంలో లెనిన్ శతజయంతి సందర్భంగా సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో మోదీ ప్రభుత్వం అధికార దాహం కోసం కులాలను, మతాలను, ప్రాంతాలను విభజించి పాలిస్తున్నారని, రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు, సీపీఎం నాయకులు భాస్కర్‌రెడ్డి, గోపాలకృష్ణ, ఫక్కీర్ సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

శివభక్తులకు అన్నదానం

నంద్యాల (కల్చరల్), జనవరి 31: నంద్యాల గుడిపాటిగడ్డలో వెలసిన మల్లికార్జునస్వామి ఆలయంలో బుధవారం నుంచి శివదీక్ష స్వీకరించిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో శివస్వాముల అన్నదానం కమిటీ సభ్యులు, శివదీక్ష స్వీకరించిన స్వాములు, శివ భక్తులు పాల్గొన్నారు.

నేడు ప్రమాణ స్వీకారం

నంద్యాల (కల్చరల్), జనవరి 31: నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం సభ్యులతో గురువారం ప్రమాణ స్వీకారం నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన భవనాశి నాగమహేష్ తెలిపారు. పట్టణంలోని సౌజన్య ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథులుగా ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు చిన్నరామ సత్యనారాయణ, ఏపీ మహాసభ గౌరవ అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ హాజరవుతారని చెప్పారు. ఆర్యవైశ్యులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

'నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి'



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో మోహన్‌కుమార్

ఆత్మకూరు, జనవరి 31: రానున్న వేసవిలో గ్రామాల్లో నీటిఎద్దడి తలెత్తకుండా ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో మోహన్‌కుమార్ సూచించారు. బుధవారం ఆత్మకూరులోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతున్న రానున్న వేసవి దృష్ట్యా గ్రామాల్లో నీటిఎద్దడి వాటిల్లకుండా ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. ఇందులో భాగంగానే ఆయా గ్రామాల్లో కొత్తగా ఏర్పాటు చేయాల్సిన బోర్లపై ప్రతిపాదించారు. అంతేకాకుండా మరమ్మత్తులకు గురైన బోర్లను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కాగా కురుకుంద గ్రామంలో నీటిఎద్దడి నివారణకు ప్రైవేటు వ్యక్తికి చెందిన బోరును ఉపయోగించుకోవాలని నిర్ణయించారు. ఇటీవల గ్రామ పంచాయతీలకు మంజూరైన నిధుల వినియోగంపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలని తెలిపారు. ఇదిలావుంటే రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆత్మకూరు మండలానికి చెందిన కీలకమైన పలు శాఖల అధికారుల బదిలీల నేపథ్యంలో కొందరు అధికారులు సర్వసభ్య సమావేశానికి హాజరుకాలేదు. దీంతో ఆయా శాఖలకు చెందిన ఇతర కిందిస్థాయి అధికారులు సమావేశానికి హాజరై తమ శాఖ వివరాలను తెలియజేశారు. జడ్పీటీసీ శంకరరెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మీదేవి ఉన్నారు.

నందికొట్కూరు: వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు అధికారులను కోరారు. బుధవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. 24వ వార్డు కౌన్సిలర్ చాంద్‌బాషా మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేసిన మోటార్లు నాలుగు రోజులకే ఎలా కాలిపోతాయని అధికారులను ఆయన ప్రశ్నించారు. కేవలం నాసిరకం మోటార్లు ఏర్పాటు చేయడం వల్లే ఈ సమస్య తలెత్తుతుందని ఆయన ఆరోపించారు. పట్టణంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని పదేపదే చెబుతున్నా విద్యుత్ శాఖ అధికారులు స్పందించడం లేదన్నారు. సీసీ రోడ్లు ఎందుకు నిర్మించడం లేదని ఆయన ప్రశ్నించారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ రబ్బానీ, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ కిషోర్, డీఈ నయాబ్ రసూల్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అప్రెంటిస్‌షిప్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి

● హక్కులను కాలరాస్తే గుణపాఠం తప్పదు ● ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహం


నంద్యాలలో మాట్లాడుతున్న ఎస్టీయూ ఉపాధ్యక్షుడు గోపాలకృష్ణ


నంద్యాలలో మాట్లాడుతున్న ఎస్టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు


గడివేములలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ కార్యదర్శి శ్రీనివాసులు

నంద్యాల (నూనెపల్లె), జనవరి 31: ఉపాధ్యాయ నియామకాలలో అప్రెంటిస్‌షిప్ వ్యవస్థను మళ్లీ పునరుద్ధరించడాన్ని ఎస్టీయూ తీవ్రంగా ఖండిస్తోందని, ఆ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్టీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోరాటాల ఫలితంగా అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయించుకుంటే వైసీపీ ప్రభుత్వం మళ్లీ దాన్ని ప్రవేశపెట్టం వెనుక ఉపాధ్యాయులను వేధింపులకు గురిచేసే విధానమేనని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మౌలాలి, సోమయ్య, రామిరెడ్డి, మనోహర్‌రెడ్డి, మధుసూదన్, ప్రభాకర్, నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల (నూనెపల్లె): ఉపాధ్యాయ నియామకాల్లో అప్రెంటిస్‌షిప్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం సిగ్గుచేటని ఆ విధానాన్ని రద్దు చేయాలని ఎస్టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సి.నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం నంద్యాలలోని ఎస్టీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోరాడి సాధించుకున్న హక్కులను ప్రభుత్వాలు ఒక్కొక్కటి తీసివేస్తున్నాయన్నారు. గతంలో సీఎంగా ఉన్న రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఉపాధ్యాయులు సంఘటితంగా 13రోజులు సమ్మె చేసి అప్రెంటిస్‌షిప్ విధానాన్ని రద్దు చేయించుకుంటే జగన్‌రెడ్డి మళ్లీ దాన్ని పునరుద్ధరించడం సరికాదని అన్నారు. హక్కులను కాలరాసే ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. రాము, కేశాలునాయక్, కుమార్, రమేష్‌నాయక్, రవి పాల్గొన్నారు.

గడివేముల: ఉపాధ్యాయ నియామకాల్లో అప్రంటిస్‌షిప్ విధానాన్ని ప్రవేశ పెడుతూ బుధవారం రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయం తీసుకోవడం దారుణమని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, నంద్యాల జిల్లా కార్యదర్శి ఆవుల మునిస్వామి అన్నారు. గడివేములలో జరిగిన ఏపీటీఎఫ్ సమావేశంలో వారు మాట్లాడుతూ 1994లో ఉపాధ్యాయ నియామకాల్లో అప్రెంటిస్‌షిప్ విధానాన్ని ప్రవేశ పెట్టారని అన్నారు. ఉపాధ్యాయ సంఘాల పోరాటాలతో 2012లో అప్రంటిస్‌షిప్ విధానాన్ని రద్దు చేశారన్నారు. 1998, 2008 డీఎస్సీ ద్వారా నియామకమైన ఉపాధ్యాయులకు రెగ్యులర్ ప్రాతిపదికన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉంటే ప్రభుత్వం మళ్లీ అప్రంటిస్‌షిప్ విధానాన్ని తీసుకొని రావడం దుర్మార్గమన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ఆంధ్రప్రదేశ్‌లో 50 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పార్లమెంట్‌లో ప్రకటించారని అన్నారు. అయితే రాష్ట్ర మంత్రి మండలి 6,100 ఉపాధ్యాయ పోస్టులను మాత్రమే డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయడానికి ఆమోదం తెలపడం దురదృష్టకరమని అన్నారు. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం 50 వేల ఉపాధ్యాయ ఖాళీలను రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు మహబూబ్‌బాషా, నాగన్న, రాముడు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలస్వామి, మానపాటి రవి తదితరులు పాల్గొన్నారు.

9వ తేదీలోపు రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలి: జేసీ


సచివాలయ సిబ్బందితో చర్చిస్తున్న జేసీ

నంద్యాల రూరల్, జనవరి 31: ఈనెల 9వ తేదీలోపు ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని నంద్యాల జాయింట్ కలెక్టరు రాహుల్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. బుధవారం పెద్ద కొట్టాల గ్రామంలో ఆయన సచివాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ నవరత్నాలలో భాగంగా నిరుపేదలకు మంజూరు చేసిన ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్, సంబంధిత అంశాలపై తహసీల్దారుతో సమీక్షించారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ సునంద, తహసీల్దారు శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

'కులగణన సర్వే త్వరగా పూర్తి చేయాలి'

కొత్తపల్లి, జనవరి 31: మండలంలోని అన్ని గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కులగణన సర్వే 89.11 శాతం పూర్తయిందని, మిగతా సర్వే త్వరగా పూర్తి చేయాలని సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం బుధవారం సూచించారు. మండలంలో 11 గ్రామ సచివాలయాల పరిధిలో 161 క్లస్టర్లు ఉన్నాయని, ఇందులో 10606 కుటుంబాలకు గానూ 30501 జనాభా ఉందని చెప్పారు. ఈ కులగణన సర్వేలో భాగంగా 9451 కుటుంబాల వద్దకు వెళ్లి 25251 మంది వివరాలను కులాల వారిగా గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఆన్‌లైన్ సర్వే నిర్వహించారని తెలిపారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

గడివేముల, జనవరి 31: మండలంలోని జిందాల్ పరిశ్రమ సమీపంలో బుధవారం లారీ అదుపు తప్పి బోల్తా పడటంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలివీ.. వరంగల్ జిల్లా నుంచి రా మేటీరియల్ తీసుకొస్తున్న లారీ వెనుక టయర్ పగిలిపోవడంతో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ రాంబాబు తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానిక వైద్యశాలకు తరలించారు.

'జగన్‌ను నమ్మి మళ్లీ మోసపోవద్దు'


ముసలిమడుగులో పాల్గొన్న టీడీపీ నాయకులు

కొత్తపల్లి, జనవరి 31: ఒక్క చాన్స్ పేరుతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన సీఎం జగన్‌ను మరోసారి నమ్మి మోసపోవద్దని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని ముసలిమడుగు, ఎర్రమటం గూడెంలో మండల కన్వీనర్ నారపురెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి లింగస్వామి గౌడు ఆధ్వర్యంలో గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుని టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం జయసూర్య మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలోనే కొత్తపల్లి మండలం అభివృద్ధి చెందిందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, సీలం లింగన్న, డీలర్ వెంకటస్వామి, సీమల గోపాల్ రెడ్డి, పలచాని మహేశ్వరరెడ్డి, పరమేశ్వరరెడ్డి, ప్రశాంత్ కుమార్ రెడ్డి, షఫీవుల్లా, శివశంకర్ రెడ్డి, రాజు, శివారెడ్డి, జూనాల సుధాకర్, మన్సూర్‌బాషా, రాధాకృష్ణారెడ్డి, సుబ్బయ్యగౌడు తదితరులు పాల్గొన్నారు.

'కుష్టు వ్యాధితో అప్రమత్తంగా ఉండాలి'


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి శాంతిప్రియ

మహానంది, జనవరి 31: గిరిజన విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంగా ఉండేందుకు పరిశుభ్రత పాటించాలని, కుష్టు వ్యాధితో అప్రమత్తంగా ఉండాలని తిమ్మాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి శాంతిప్రియ సూచించారు. మహానందిలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో బుధవారం ఎంపీ హెచ్‌ఈవో ఉసేన్‌రెడ్డి ఆధ్వర్యంలో కుష్టు నివారణపై గిరిజన విద్యార్థులకు అవ గాహన సదస్సు నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు ప్రతి రోజు స్నానం చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దీనివల్ల దోమల వ్యాప్తితో పాటు అంటురోగాలు సోకకుండా ఉంటాయన్నారు. ప్రధానోపాధ్యాయిని అంబమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల విజ్ఞాన యాత్ర


విజ్ఞాన యాత్రలో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు

గోస్పాడు, జనవరి 31: గోస్పాడు ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు వివిధ అంశాలపై ఆకళింపు చేసుకునేందుకు వీలుగా విజ్ఞాన యాత్రలో పాల్గొన్నారు. బుధవారం పాఠశాలలో 10వ తరగతి, ఇంటర్ చదువుతున్న 156 మంది విద్యార్థులను నంద్యాలలోని ఎస్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు అధ్యాపక బృందం విజ్ఞాన యాత్రకు తీసుకెళ్లారు. పాఠశాల ప్రిన్సిపల్ ఖాజాహుసేన్ ఆధ్వర్యంలో, ఒకేషనల్ ఉపాధ్యాయులు విజయమ్మ, నరేష్‌బాబు, సుజాత, మద్దిలేటి, తదితరులు బృందం విద్యార్థులను పర్యవేక్షించింది. ఇంజనీరింగ్ కళాశాలలో సాంకేతికతను ఉపయోగించుకొని భవిష్యత్తులో ప్రయోజనాలు ఏలా పొందాలో అన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణ పొంది ఉత్తీర్ణత సాధించి మంచి ఉద్యోగ అవకాశాలకు విజ్ఞాన యాత్రలు ఎంతగానో ఉపయోగపడతాయని అధ్యాపక బృందం విద్యార్థులకు విశదీకరించింది. ఎస్‌వీఆర్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'సమ సమాజ స్థాపనకు కృషి'


మాట్లాడుతున్న పాండురంగ యాదవ్

నంద్యాల (నూనెపల్లె), జనవరి 31: సమ సమాజ స్థాపనకు సమాజ్‌వాది పార్టీ కృషి చేస్తుందని ఆ పార్టీ రాయలసీమ జిల్లాల కో ఆర్డినేటర్ పాండురంగయాదవ్ అన్నారు. నంద్యాలలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ యాదవ్ అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. పాండురంగయాదవ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో నంద్యాల జిల్లా అంతటా అన్ని వర్గాలకు ప్రాధాన్యమిస్తూ కలుపుకొని పోతామన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్‌యాదవ్ త్వరలో రాష్ట్ర పర్యటన జరగనున్న నేపథ్యంలో కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. మధు, రాజేష్, హనుమంతుకుమార్ నాయుడు, అనిల్ కుమార్, నరసయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించాలి'


నంద్యాలలో ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

నంద్యాల (నూనెపల్లె), జనవరి 31: మున్సిపల్ ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్యలు డిమాండ్ చేశారు. బుధవారం ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నంద్యాలలోని బొమ్మలసత్రం సెంటర్‌లో ధర్నా చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని జడ్పీ, ప్రభుత్వ యాజమాన్య ఉపాధ్యాయులకు దాదాపు 1800 మందికి పదోన్నతులు కల్పించి మున్సిపల్ ఉపాధ్యాయుల విషయానికొచ్చేసరికి సర్వీస్ రూల్స్ సాకుగా చూపి వివక్షకు గురిచేస్తున్నారని దుయ్యబట్టారు. దశాబ్దాలుగా మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వాలు ఎందుకు ఇలా వ్యవహరిస్తున్నాయన్నారు. నేటికీ పీఎఫ్ సౌకర్యం కల్పించలేదని, వారి బకాయిలన్నీ అనామత్‌ఖాతాలో చేరిపోయి తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణీకరణతో పెరిగిన జనాభాకు సరిపడా పాఠశాలలు స్థాపించాలన్నారు. మున్సిపల్ పాఠశాలల పర్యవేక్షణకు ఎంఈవో, డిప్యూటీ ఈఓ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ భాస్కరరెడ్డి, వీరేశ్వరరెడ్డి, రాజ్‌కుమార్, హరినాథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'నిధులు లేకుండా అభివృద్ధి ఎలా?'

పాములపాడు, జనవరి 31: గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేయకుండా అభివృద్ధి అంటే ఎలా అని సర్పంచ్‌లు మండిపడ్డారు. బుధవారం పాములపాడులోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సరోజినీ వర్ధినియా అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు ఆయా శాఖలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలును చదివి వినిపించారు. మిట్టకందాల, ఇస్కాల తదితర గ్రామ సర్పంచులు మాట్లాడుతూ పంచాయతీల నిధులు కరెంటు బిల్లులకు, పారిశుధ్య కార్మికులు జీతాలకే సరిపోతున్నాయని గ్రామంలో మౌలిక సదుపాయాలకు నిధులు మంజూరు కాకపోతే గ్రామంలో ఎలా అభివృద్ధి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో కరుణాసాగర్, ఈవోఆర్డీని ప్రశ్నించారు. తమ సొంత నిధులతో మంచినీటి వసతిని ఏర్పాటు చేస్తున్నామని, చివరకు అప్పులు పాలవుతున్నామని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు రావడం లేదని వస్తే మంజూరు చేస్తామని సున్నితంగా అధికారులు తెలిపారు. ఇస్కాల గ్రామంలో త్రాగునీటి వసతి కల్పించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధుల, మండల అధికారులు పాల్గొన్నారు.

అధికారుల పదవీ విరమణ

నంద్యాల రూరల్, జనవరి 31: జిల్లా వనరుల కేంద్రం ఉప వ్యవసాయ సంచాలకుడు కె.జయదేవ్ పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ జిల్లా అధికారి టి. రామ్మోహన్ ఆధ్వర్యంలో బుధవారం ఆత్మీయ సభను నిర్వహించారు. ఆత్మీయ సభలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మాట్లాడుతూ జయదేవ్ వ్యవ సాయ పథకాలను క్షేత్ర స్థాయిలో అన్నదాత దరికి చేర్చారని కొనియాడారు. పరిశోధన కేంద్ర సిబ్బంది, ఉమ్మడి జిల్లాల వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మహానంది: రెవెన్యూ శాఖలో ఉద్యోగం కత్తిమీద సాములాంటిదని మహానంది ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మహానంది మండల తహసీల్దార్ జనార్దన్‌శెట్టి పదవీ విరమణ కార్యక్రమం మహానంది సమీపంలోని కుమ్మరి శాలివాహన మంటపంలో రెవెన్యూ సిబ్బంది నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్వో పుల్లయ్య, వైసీపీ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్లు శ్రీనివాసులు, నారాయణరెడ్డి, పలువురు ప్రముఖులు పాల్గొని జనార్దన్‌శెట్టిని సన్మానించారు.

'ఉద్యాన పంటలపై దృష్టి సారించాలి'

కొత్తపల్లి, జనవరి 31: రైతులు ఉద్యాన పంటలపై దృష్టి సారించాలని క్వాలిటీ కంట్రోల్ అధికారి గంగాద్రి సూచించారు. బుధవారం స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో ఏపీవో రేష్మా ఆధ్వర్యంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో వంద ఎకరాల్లోపు మాత్రమే రైతులు ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారని, ఇంకా ఎక్కువ మంది రైతులు పంటలను సాగు చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రైతులను ప్రోత్సహించాలని సూచించారు. అదే విధంగా ఫారంపాండ్స్, మినీ పర్క్యులేషన్ ట్యాంకులు, కొత్త పనులను త్వరగా గుర్తించాలన్నారు. అలాగే కొలతల రిజిష్టర్లను టెక్నికల్ అసిస్టెంట్లు పక్కాగా నిర్వహించాలని అన్నారు. వాటిని ఏ విధంగా నిర్వహించాలో వారికి వివరించారు. అనంతరం దుద్యాల గ్రామ శివారులో రైతులు హార్టికల్చర్ కింద సాగు చేసుకుంటున్న జామతోటలను పరిశీలించారు. రైతులు ఇంకా కాస్త మెరుగ్గా పంటలు సాగులో మెలకువలు పాటించాలని సూచించారు.

8న 'చలో విజయవాడ': సీఐటీయూ


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం

ఆత్మకూరు, జనవరి 31: ఆశావర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 8వ తేదీన చేపట్టబోవు చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు భారతి, శారద, లక్ష్మీ పిలుపునిచ్చారు. ఆత్మకూరులోని సీపీఎం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ఇస్తున్న వేతనాల్లో ప్రతినెలా రూ.3వేల వరకు విధి నిర్వహణకు ఖర్చు అవుతున్నాయని తెలిపారు. టీఏ, డీఏ చెల్లించకుండా రోజురోజుకూ పని భారం పెంచుతున్నారని వివరించారు. మరణించిన ఆశాలకు ఎక్స్‌గ్రేషియో కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా అనేక విధాలుగా సేవలందిస్తున్న ఆశాలకు రిటైర్డుమెంట్ అనంతరం పెన్షన్ సదుపాయం కల్పించాలని, మెటర్నరీ లీవ్స్ మంజూరు చేయాలని, ప్రతినెలా వేతనాలు ఒకటో తేదీనే ఇవ్వాలని, ప్రమాద బీమా సదుపాయం కల్పించాలని, ఉద్యోగ భద్రత ఇవ్వాలని కోరారు. రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు.

టెండర్లు లేకుండానే బిల్లులు ఎలా డ్రా చేస్తారు?

● పది రోజుల్లో శ్వేతపత్రం విడుదల చేయాలి

● చైర్‌పర్సన్‌కు కౌన్సిలర్ ప్రశ్నల వర్షం


ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ దేశం సులోచన

నంద్యాల టౌన్, జనవరి 31: మున్సిపల్ నిధుల నుంచి టెండర్లు లేకుండా రూ.లక్షలకు లక్షలు ఎలా డ్రా చేస్తారని నంద్యాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ మాబున్నీసాను అధికార పక్ష వైసీపీకి చెందిన 18వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ దేశం సులోచన ప్రశ్నించడం అధికార పక్షంలో కలకలం రేపింది. బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. అధికార పార్టీకి చెందిన దేశం సులోచన మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై గళం విప్పడం, అందుకు చైర్‌పర్సన్ సమాధానం ఇవ్వలేని స్థితి ఏర్పడింది. వారి పార్టీకే చెందిన కౌన్సిలర్ వరుసపెట్టి ప్రశ్నలు సంధించడంతో స్వపక్ష కౌన్సిలర్లందరి నోట మాట రాలేని పరిస్థితి ఏర్పడింది. ఏకంగా రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల బిల్లులు టెండర్లు లేకుండా ఎలా డ్రా చేస్తారని ప్రశ్నించారు. ఆరోగ్య సురక్ష కింద రూ.4 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందని, అయితే మున్సిపల్ నిధుల నుంచి రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలు డ్రా చేయాలని ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. గతంలో కూడా రూ.16 లక్షలు టెండరు లేకుండానే డ్రా చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పారిశుధ్య నిర్వహణలో ట్రాక్టర్లను బాడుగకు తీసుకొనే ప్రక్రియలో టెండరు విధానం ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. పారిశుధ్య కార్మికులకు ఏడాది కాలంగా సబ్బులు, ఆయిల్, యూనిఫాం ఇవ్వకుంటే ఎలా అని ప్రశ్నించారు. ఇటీవల మున్సిపాలిటీలో రూ.కోటికిపైగా అవినీతి జరిగినట్లు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోందన్నారు. వారం పది రోజుల్లో తాను లేవనెత్తిన అంశాలపై శ్వేత పత్రం విడుదల చేయాలని, అవినీతికి పాల్పడేవారెవరో ప్రజలకు తెలియాల్సి ఉందని అన్నారు. గత మూడేళ్లుగా తన వార్డులో ఒక్క పని కూడా చేయలేదని టీడీపీ ఫ్లోర్ లీడర్ మాబువలి చెప్పారు. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి ప్రతిపక్షం ప్రాతినిధ్యం వహించే వార్డులను చులకనగా చూస్తున్నారన్నారు. 12వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ కండె శ్యాంసుందర్‌లాల్ మాట్లాడుతూ తన వార్డులో పాఠశాల ప్యారాపెట్‌వాల్ కూలిపోయే స్థితి నెలకొందని గతంలో నాలుగు, ఐదు సమావేశాల్లో మరమ్మత్తుల కోసం అడిగితే స్పందించలేదని చెప్పారు. ఇప్పుడు అది కూలిపోయిందని తెలిపారు. పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ పట్టణంలో పలు ప్రాంతాల్లో దోమల బెడద ఎక్కువైందని, ఫాగింగ్ జరగడం లేదని, కుక్కల బెడద తీవ్రంగా ఉందని కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.85.66 కోట్లతో అంచనా బడ్జెట్ ఆమోదం

నంద్యాల పురపాలక సంఘానికి సంబంధించి రూ.85.66 కోట్లతో 2024-2025 ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను కౌన్సిల్ సమావేశంలో ఆమోదించారు. కమిషనర్ రవిచంద్రారెడ్డి బడ్జెట్‌లోని అంశాలను వివరించారు.

'అరాచక పాలనకు పతనం తప్పదు'



కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, జనవరి 31: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు పతనం తప్పదని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, బూత్ ఇన్‌చార్జి నరసింహారెడ్డి అన్నారు. చాగలమర్రిలోని మూడో వార్డులోని 212 బూత్‌లో బుధవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ కరపత్రాలను అందజేసి ప్రజలకు మేనిఫెస్టో గురించి వివరించారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. టీడీపీ నాయకులు నాగేశ్వరమ్మ, భారతి, పార్వతి, ఉమాదేవి, సావిత్రమ్మ, శైలజ, ప్రభావతి, పెద్ద నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌ఐగా వరప్రసాద్

కోవెలకుంట్ల, జనవరి 31: కోవెలకుంట్ల ఎస్‌ఐగా వరప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. బదిలీల్లో భాగంగా ఆస్పరిలో పని చేస్తున్న వరప్రసాద్‌ను కోవెలకుంట్లకు బదిలీ చేశారు. కోవెలకుంట్లలో పనిచేసే ఎస్‌ఐ కడప జిల్లా వీరపనేనిపల్లెకు బదిలీ అయ్యారు. ఎస్‌ఐ వరప్రసాద్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలపరిరక్షణకు ప్రజలు సహకరించాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కవయిత్రి మొల్లమాంబ విగ్రహావిష్కరణ

బనగానపల్లె, జనవరి 31: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఏర్పాటు చేసిన కవయిత్రి మొల్లమాంబ విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మొల్లమాంబ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ మొల్ల రామాయణం రాసి ప్రసిద్ధి చెందారన్నారు. కార్యక్రమంలో కుమ్మర శాలివాహన కార్పొరేషన్ ఏపీ చైర్మన్ పురుషోత్తం, శాలివాహన సంఘం నియోజకవర్గం అధ్యక్షుడు సురేష్‌బాబు, కార్యదర్శి శివరాం, కాటసాని తిరుపాలురెడ్డి, యాగంటి ఆలయ చైర్మన్ బుచ్చిరెడ్డి, అబ్దుల్ ఫైజ్, శ్రీరామ వెంకట సుబ్రహ్మణ్యం గుండా రవికుమార్, రవీంద్ర విద్యాసంస్థల అధినేత పుల్లయ్య, జిల్లా అధ్యక్షుడు మద్దయ్య, కార్యదర్శి బలరాం బాబయ్య ఈవో ఖలీల్‌బాషా, దస్తగిరి, నాగభూషణం పాల్గొన్నారు.

వార్డెన్ పదవీ విరమణ

కోవెలకుంట్ల, జనవరి 31: పట్టణంలోని బీసీ సంక్షేమ వసతి గృహం వార్డెన్ మురళి మద్దిలేటి బుధవారం పదవీ విరమణ పొందారు. ఈసందర్భంగా పలువురు వార్డెన్ దంపతులను ఘనంగా సత్కరించారు. వక్తలు మాట్లాడుతూ 36 ఏళ్లుగా పలుచోట్ల వార్డెన్‌గా సేవలందించి విద్యార్థుల, ఉన్నతాధికారుల మన్ననలు పొందారన్నారు. కార్యక్రమంలో వార్డెన్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, ముని రాజ్, సురేశ్, గోపాల్, గోవర్దన్, దర్గయ్య, శ్రీధర్‌బాబు, సంక్షేమ హాస్టల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యాదవ సంఘం నాయకుడి మృతి

బనగానపల్లె, జనవరి 31: మండలంలోని చెర్లోకొత్తూరు గ్రామానికి చెందిన యాదవ సంఘం నాయకుడు నక్కా రామస్వామియాదవ్ (63) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతి యాదవ సంఘానికి తీరనిలోటని సంఘం నాయకులు పేర్కొన్నారు. ఆయన మృతదేహానికి మద్దయ్య యాదవ్, గణమద్దిలేటియాదవ్, శంకర్, నాగేషుడు, సుధాకర్, బాలరాజు, తిమ్మరాజు, రంగస్వామి, శివకృష్ణయాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వ్యక్తి అదృశ్యం

కోవెలకుంట్ల, జనవరి 31: మండలంలోని గుల్లదుర్తి గ్రామానికి చెందిన రంగయ్య కుమారుడు దేశెట్టి ఉసేనయ్య అదృశ్యమయ్యారు. అతని కుమారుడు రాకేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ కల్పన బుధవారం తెలిపారు. నాలుగురోజుల క్రితం ఉసేనయ్య ఇంటి నుంచి వెళ్లిపోయి కనిపించకపోవడంతో బుధవారం ఆయన కుమారుడు ఫిర్యాదు చేయడంతో అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

'కుష్టు వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలి'

చాగలమర్రి, జనవరి 31: కుష్టు వ్యాధితో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు ఇమ్రాన్, అంజలి సూచించారు. బుధవారం చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలలో వారు మాట్లాడుతూ స్పర్శ కుష్టువ్యాధి పక్షోత్సవాల్లో భాగంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. కుష్టువ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి ప్రభుత్వ వైద్యశాలలో సేవలు అందిస్తామని, ప్రాథమిక దశలోనే కుష్టువ్యాధిని గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఈ వెంకటమ్మ, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, వైద్య సిబ్బంది ఉన్నారు.

'బకాయిలు చెల్లించాలి'

చాగలమర్రి, జనవరి 31: ఉపాధ్యాయుల, ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలని ఎస్టీయూ మండల అధ్యక్షుడు మస్తాన్‌వలి, కార్యదర్శి సుబ్బారావు, కోశాధికారి మాబుహుసేన్ కోరారు. బుధవారం చాగలమర్రి ఎస్టీయూ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షన్‌దారులకు 1వ తేదీన జీతాలు చెల్లించాలని, పీఆర్సీ బకాయిలు, సరైండర్ లీవ్‌లు, ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించి ఆదుకోవాలని కోరారు. బ్యాంకులో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ఉపాధ్యాయులపై కక్ష ధోరణి విడనాడాలన్నారు. ఎస్టీయూ నాయకులు శివశంకర్, ప్రసాద్, నారాయణరెడ్డి, మహబూబ్‌బాషా, శేషాద్రి, నరసింహులు, సురేషప్ప, శ్రీనివాసులు, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

'రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి'

రుద్రవరం, జనవరి 31: మండలంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని తహసీల్దారు రవీంద్రప్రసాద్ వీఆర్వోలను, హౌసింగ్ సిబ్బందిని ఆదేశించారు. మండలంలో 1028 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశామని చెప్పారు. రిజిస్ట్రేషన్ల విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.

తహసీల్దార్ బదిలీ

డోన్, జనవరి 31: సార్వత్రిక ఎన్నికల సాధారణ బదిలీల్లో భాగంగా డోన్ తహసీల్దార్ విద్యాసాగర్‌ను కడప జిల్లాకు బదిలీ చేస్తూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏడాదిన్నర క్రితం డోన్ తహసీల్దార్‌గా విద్యాసాగర్ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆయన కడప జిల్లాకు బదిలీ అయ్యారు.

వీఆర్‌ఏల నిరసన



నిరసన తెలుపుతున్న వీఆర్‌ఏల సంఘం నాయకులు

బనగానపల్లె, జనవరి 31: తమ డిమాండ్లను నెరవేర్చాలని మండల వీఆర్‌ఏల సంఘం నాయకులు బుధవారం బనగానపల్లె తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెలోకి వెళ్తామని వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు నందిపల్లె నగేశ్, సీఐటీయూ నాయకుడు సుబ్బయ్య హెచ్చరించారు. వీఆర్‌ఏలకు పేస్కేలు అమలు చేయాలని, నామినీలను వీఆర్‌ఏలుగా రెగ్యులర్ చేయాలని, డీఏను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బనగానపల్లె వీఆర్ ఏల సంఘం అధ్యక్షుడు తలారి బాలుడు, సభ్యులు గౌస్‌పీరా, అలీంబాషా, రాముడు, బాలమద్దయ్య, విజయ్ పాల్గొన్నారు.

బొప్పాయికి తెగుళ్లు

- కాండం కుళ్లుతో ఎండుతున్న చెట్లు
- ఆందోళనలో రైతులు

రుద్రవరం, జనవరి 31: మండలంలోని నాగులవరం గ్రామానికి చెందిన రైతులు సాగు చేసిన బొప్పాయి తోటల్లో కాండం కుళ్లు తెగుళ్లు సోకింది. దీంతో చెట్లు ఎండిపోతున్నాయి. చెట్లు పంటకు వచ్చే సమయంలో ఎండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో సుమారు వంద ఎకరాల్లో బొప్పాయి తోటలు రైతులు సాగు చేశారు. చెట్లు ఎండిపోయి ఆకులు రాలిపోతున్నాయి. కాండానికి సన్నటి కాయలు మాత్రం అలాగే ఉన్నాయి. బొప్పాయి తోటలోనే అంతరపంటగా పసుపును సాగు చేశారు. బొప్పాయి తోటల్లో కాండం కుళ్లు తెగులు సోకినప్పుడు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉద్యాన శాఖాధికారి నరేష్‌కుమార్‌రెడ్డి వివరించారు. ఒక లీటరు నీటికి రెడోమిల్ గోల్డ్ కలిపి కాండం వద్ద వేయాలి. అలాగే ఒక లీటరు నీటికి 0.5 గ్రాములు ఇండెక్స్ కలిపి పిచికారి చేయాలని ఆయన సూచించారు.



ఎండిన బొప్పాయి చెట్లు

టీడీపీతోనే బీసీల సంక్షేమం



మాట్లాడుతున్న సల్లా నాగరాజు

చాగలమర్రి, జనవరి 31: రాష్ట్రంలో టీడీపీతోనే బీసీల సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి సల్లా నాగరాజు అన్నారు. బుధవారం చాగలమర్రి టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చాగలమర్రి గ్రామంలోని వాసవీ కల్యాణ మండపంలో జయహో బీసీ కార్యక్రమం గురువారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ముఖ్య అతిథిగా హాజరవుతారని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీసీ నాయకులు గుర్రప్ప, శ్రీరాములు, వీరభద్రుడు, సుబ్బన్న, బోయ వెంకటేష్, రాముడు, ఓబులేసు పాల్గొన్నారు.

'ప్రజలు సహకరించాలి'



గ్రామస్థులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ హనుమంతనాయక్

ఆళ్లగడ్డ, జనవరి 31: వచ్చే ఎన్నికలను ప్రశాంతం నిర్వహించుకునేందుకు ప్రజలు సహకరించాలని రూరల్ సీఐ హనుమంత నాయక్ కోరారు. మండలంలోని బాచేపల్లె గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా ప్రజలతో రూరల్ ఎస్‌ఐ నరసింహులు ఆధ్వర్యంలో సమావేశం బుధవారం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ బాచేపల్లె గ్రామంలో ఎన్నికల్లో చోటు చేసుకున్న ఘటనలతో సమస్యాత్మక గ్రామంగా గుర్తించినట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామంలో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, ఘర్షణలకు దిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ వంతెనకు మరమ్మతులెన్నడో?

బనగానపల్లె, జనవరి 31: మండలంలోని పండ్లాపురం గ్రామ సమీపంలోని వంక మీద ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. బనగానపల్లె- నంద్యాల రహదారిలోని పండ్లాపురం మీదుగా వందలాది వాహనాలు తిరుగుతుం టాయి. నందవరం చౌడేశ్వరీ మాత, సుబ్బరాయుని కొత్తూరు, యాగంటి క్షేత్రాలకు నిత్యం వందలాది మంది వాహనాల్లో ఈ మార్గం గుండా ప్రయాణిస్తుంటారు. అలాగే ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులు, ఆటోలు, ద్విచక్రవాహనాలు నిత్యం ఈ మార్గంలో సంచరిస్తుంటాయి. పొరబాటున వంతెన వద్ద రెండు వైపులా ఉన్న రక్షణ గోడ కూలిపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయని ప్రయాణికులు అంటున్నారు. వంతెనకు మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులను కోరినా ఫలితం లేదని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. ఈ వంతెన ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని అన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారుల ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసి వంతెనకు రక్షక గోడలు నిర్మించాలని కోరుతున్నారు.



ప్రమాదకరంగా మారిన పండ్లాపురం వంతెన

డోన్ ఎంపీడీవో బదిలీ

డోన్(రూరల్), జనవరి 31: డోన్ ఎంపీడీవో శ్రీనివాసులు అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. డోన్ నుంచి బదిలీ అయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సచివాలయ ఉద్యోగులు, వివిధ గ్రామాల కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు ఆయన్ను ఘనంగా దుశ్శాలువాలతో సన్మానించారు. డోన్‌లో నాలుగేళ్లకు పైగా పని చేసిన ఎంపీడీవో శ్రీనివాసులు సేవలను కొనియాడారు. ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని, డోన్‌లో పని చేసినందుకు తమకు సంతోషంగా ఉందని, ఇక్కడ డోన్ మండల ప్రజల సహకారాలు మరువలేనివని ఎంపీడీవో శ్రీనివాసులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, జడ్పీటీసీ సభ్యులు బద్దెల రాజ్‌కుమార్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు, హౌసింగ్ ఏఈ నాగభూషణం, కొత్తబురుజు పీహెచ్‌సీ డా. రాంభూపాల్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, మండల కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రవరం ఎంపీడీవో..

రుద్రవరం: రుద్రవరం మండల పరిషత్‌లో పనిచేస్తున్న ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి కడప జిల్లా కాశినాయన మండలం ఎంపీడీవోగా బదిలీ అయ్యారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ అధికా రులు బదిలీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న ఏవో వరలక్ష్మికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పతనం తప్పదు



విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

ప్యాపిలి, జనవరి 31: వచ్చే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పతనం తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు విమర్శించారు. బుధవారం పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా పోరాటాల కోసం విరాళాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాయుడు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రాజధాని నిర్మించలేని దుస్థితిలో ఉందన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాధాక్రిష్ణ, సూర్యప్రతాప్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు విద్యార్థుల ఎంపిక



ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్

ఆళ్లగడ్డ, జనవరి 31: మండలంలోని కోటకందుకూరు ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రాజు బుధవారం చెప్పారు. ఎంపికైన వారిలో వెంకటహన్సిక, భరత్ కుమార్, భానూజా, అసిఫా, హజిరా ఉన్నారని వీరంతా పాఠశాలలో 8వ తరగతి చదువుచున్నారని చెప్పారు. వీరికి ఇంటర్ పూర్తయ్యే వరకు ఏడాదికి రూ. 12వేలు చొప్పున ఉపకార వేతనం వస్తుందని తెలిపారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నరేంద్ర, పాపయ్య, శివబ్రహ్మం పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేస్తున్న వైసీపీ



మాట్లాడుతున్న గార్లపాటి మద్దిలేటి

డోన్(రూరల్), జనవరి 31: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తున్నదని కాంగ్రెస్ పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి, డోన్ నియోజకవర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి ఆరోపించారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో నిరుద్యోగులకు ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ల విడుదల డ్రామాను తెరలేపిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులను మభ్యపెట్టేందుకు వైసీపీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు యు. జనార్దన్, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎం. నాగసుబ్బయ్య, డోన్ పట్టణ అధ్యక్షుడు ఆర్.గోపినాథరావు, డోన్ మండల అధ్యక్షుడు వడ్డె రాజశేఖర్, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ ఎస్. లక్ష్మన్న పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు కౌన్సిలర్లు సహకరించాలి: చైర్మన్

బేతంచెర్ల, జనవరి 31: నగర పంచాయతీ పరిధిలోని ఆయా వార్డుల్లో చేస్తున్న పలు అభివృద్ధి పనులకు కౌన్సిలర్లు అందరూ సహకరించాలని నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని పంచాయతీ కార్యాలయం సమావేశ భవనంలో కౌన్సిలర్ల సర్వ సభ్య సమావేశం చైర్మన్ చలంరెడ్డి అధ్యక్షతన కమిషనర్ రమేష్‌బాబు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని వివిధ వార్డులలో సీసీ రోడ్లు, సీసీ కాలువలు తదితర అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, సమావేశంలో తీర్మానాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా 17వ వార్డు టీడీపీ వార్డు కౌన్సిలర్ నంద్యాల కుమారి మాట్లాడుతూ తమ వార్డులో మహిళలు చాలా ఇబ్బంది పడుతున్నారని, సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని ఆమె చైర్మన్, కమిషనర్ల దృష్టికి తెచ్చారు. అందుకు వారు స్పందిస్తూ సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టామని, త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. కౌన్సిలర్ బుగ్గన సుశీలమ్మ మాట్లాడుతూ తమ వార్డులో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలుపగా.. చైర్మన్ స్పందిస్తూ ట్యాంకర్ల ద్వారా తాగు నీరు సరఫరా చేస్తున్నామని చైర్మన్ సూచించారు. ఈ సమావేశంలో కోఆప్షన్ సభ్యుడు ఎల్లయ్య, ఆయా వార్డుల కౌన్సిలర్లు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమస్యలను చైర్మన్ దృష్టికి తెచ్చిన టీడీపీ వార్డు కౌన్సిలర్ కుమారి

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు: డీఎస్పీ



విద్యార్థినులకు బహుమతులను అందజేస్తున్న డీఎస్పీ

ఆళ్లగడ్డ, జనవరి 31: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని, విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డీఎస్పీ వెంకటరామయ్య అన్నారు. గత ఏడాది నవంబరులో పాఠశాలల విద్యార్థులకు బాలికా దినోత్సవం పురస్కరించుకొని వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థినులకు బుధవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో బహుమతులు పంపిణీ చేశారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఈ పోటీలను విజయవంతంగా నిర్వహించారని పట్టణ సీఐ రమేష్‌బాబు, ఎస్‌ఐ వెంకటరెడ్డిని డీఎస్పీ అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో హెచ్‌ఎం

సంజామల, జనవరి 31: మండలంలోని కానాల, సంజామల ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచి ప్రశంసా పత్రాలు పొందినట్లు హెచ్‌ఎం అరుణకుమారి, శంకర్ బుధవారం తెలిపారు. జనవరి 28, 29 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగిన రాష్ట్ర స్థాయి రోప్, స్కిప్పింగ్ అండర్ 17 విభాగంలో లక్ష్మి జగదీశ్, చిన్మయి, అండర్ 14 రోప్, స్కిప్పింగ్ పోటీల్లో బషీరూన్, కౌసర్, హుసేన్‌బీ అత్యుత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రశంసా పత్రాలు పొందినట్లు తెలిపారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

చాగలమర్రి, జనవరి 31: మండలంలోని రాంపల్లె గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పుల్లయ్య అనారోగ్యానికి గురవడంతో ఆళ్లగడ్డ టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి బుధవారం పరామర్శించారు. ప్రొద్దుటూరులో నివాసం ఉంటున్న మాజీ సర్పంచ్ పుల్లయ్య నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, నాయకులు నరేంద్ర, నర్సిరెడ్డి, శేఖర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, లక్ష్మీరెడ్డి, హరిరాజు, మాలిక్‌బాషా ఉన్నారు.



పుల్లయ్యను పరామర్శిస్తున్న భూమా జగత్ విఖ్యాతరెడ్డి

నిరుపయోగంగా దోబీఘాట్ ట్యాంకు

రుద్రవరం, జనవరి 31: మండలంలోని ఆలమూరు గ్రామంలో దోబీ ఘాట్‌కు ఏర్పాటు చేసిన మినీ ట్యాంకు నిరుపయోగంగా మారింది. వీటికి బోరును కూడా ఏర్పాటు చేశారు. కానీ మినీ ట్యాంకు మాత్రం ఉపయోగంలో లేదు. రజకులు ఇక్కడ దుస్తులు శుభ్రం చేయడం లేదు. దొళ్ల వాగులో శుభ్రం చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు.



ఆలమూరులో అలంకారప్రాయంగా దోబీఘాట్ ట్యాంకు

కాలువలు నిర్మించాలని ఆందోళన



ముక్కు మూసుకొని నిరసన తెలుపుతున్న ఊటకొండ గ్రామస్థులు

ప్యాపిలి, జనవరి 31: మురుగు నీరు రోడ్డుపై నిల్వకుండా కాలువలు నిర్మించాలని బుధవారం మండలంలోని ఊటకొండ గ్రామస్థులు ముక్కు మూసుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థుడు రాందాసు మాట్లాడుతూ ప్రజలు ప్యాపిలి, డోన్ ప్రాంతాలకు ఈ రోడ్డు మీదుగానే వెళ్లాల్సి ఉందన్నారు. అయితే రోడ్డు అధ్వానంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుపై మురుగు నిలవడం వలన దుర్వాసన భరించలేకపోతున్నామన్నారు. అధికారులు తక్షణమే స్పందించి డ్రైనేజీ నిర్మించాలని కోరారు.

'కుల గణనలో తప్పుగా నమోదు చేస్తున్నారు'

డోన్, జనవరి 31: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కుల గణన సర్వేలో దూదేకుల, నూర్‌బాషా, పింజరి, లాదస్ కులాలను తప్పుగా నమోదు చేస్తున్నారని బుధవారం డోన్ ఆర్డీవోకు దూదేకుల సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో దూదేకుల సంక్షేమ సంఘం నాయకులు క్వాలిటీ అబ్దుల్లా, సుభాన్ బాషా, కాశీం, ఖాజాపీరా తదితరులు వినతి పత్రం అందజేశారు. హిందూ కులగణన సర్వేలో హిందూ మతంలోకి మారుస్తూ తప్పుగా నమోదు చేయడం సరికాదని వినతి పత్రంలో పేర్కొన్నారు. తాము బీసీ-బీ రిజర్వేషన్‌కు చెందిన వారమని, తప్పుగా నమోదు చేయడం వల్ల రిజర్వేషన్లు కూడా కోల్పోవాల్సి వస్తుందని వారు పేర్కొన్నారు. సంబంధిత కుల గణన అధికారులకు తమ కులాన్ని ఇండియన్-ఇస్లాం-దూదేకులుగా నమోదు చేయాలని వినతి పత్రంలో కోరారు. కుల ధృవీకరణ పత్రాలు, పిల్లల ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు పై విధంగానే ఇవ్వాలని ఆర్డీవో వెంకటరెడ్డిని కోరారు.

బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి

ఆళ్లగడ్డ, జనవరి 31: ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపో నుంచి తొలగించిన బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన అధ్యక్ష, కార్యదర్శులు రాజారావు, కృష్ణ కోరారు. పట్టణంలో ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డికి బుధవారం వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ డీఎం రాజశేఖరరెడ్డి ఆర్టీసీ డిపో నుంచి తిరుపతి, ఒంగోలు, కర్నూలు, హైదరాబాదు, శ్రీశైలం, విజయవాడ, మైదుకూరు సర్వీసులతో పాటు విద్యార్థి బస్సులైన జంగాలపల్లె, ఉయ్యాలవాడ తదితర బస్సు సర్వీసులను పూర్తి స్థాయిలో రద్దు చేశారని తెలిపారు. డిపో నుంచి అనాది కాలం నుంచి తిరుగుతున్న సర్వీసులను ఎందుకు రద్దు చేశారని వారు ప్రశ్నించారు. సుధారాజు, అడ్వైజర్ ఎల్వీమోహన్, బెనార్డ్, ప్రసాదు, గురవయ్య, నారాయణ, బీఎన్ రెడ్డి, మాయన్న, శ్రీనివాసరావు, కార్మికులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న బ్రిడ్జి



తెలుగుగంగ ప్రధాన కాలువపై దెబ్బతిన్న వంతెన

రుద్రవరం, జనవరి 31: మండలంలోని కోటకొండ గ్రామ సమీపంలో తెలుగుంగ కాలువపై నిర్మించిన బ్రిడ్జి దెబ్బతింది. కాలువ అటు వైపు పంట భూములు ఉండడంతో రాకపోకలకు సౌకర్యంగా ఉంటుందని బ్రిడ్జి నిర్మించారు. ఈ బ్రిడ్జిపై మట్టి ట్రాక్టర్ల రాకపోకలతో బ్రిడ్జి సైడ్ వాల్స్ దెబ్బతిన్నాయి. గంగ అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని పలువురు వాపోతున్నారు.

త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం

చాగలమర్రి, జనవరి 31: చాగలమర్రిలోని భూమా నగర్‌లో త్యాగరాజ స్వామి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా సీతారామాలయంలో వెలసిన త్యాగరాజస్వామికి నాయీ బ్రాహ్మణులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. త్యాగరాజ స్వామికి ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.